

జూలపల్లి: తాటిచెట్టుపై గులాబీ జెండాలతో గీత కార్మికులు



ధర్మారం: నంది మేడారంలో జరిగిన ప్రజాఆశీర్వాద యాత్రలో మంత్రి ఈశ్వర్‌కు బతుకమ్మలతో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

ధర్మార : నంది మేడారంలో కొప్పుల ఈశ్వర్ నిర్వహించిన ప్రజా ఆశీర్వాద యాత్రలో మాట్లాడుతున్న మిమిక్రి ఆర్టిస్ట్ శివారెడ్డి





జ్యోతినగర్, రామగుండం బీఆర్ఎస్ అభ్యర్థి కోరుకంటి చందర్‌ను గెలిపించాలని ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



గోదావరిఖని : రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

# బీఆర్ఎస్‌దే హవా

## గెలుపు ధీమాలో శ్రేణులు

బీఆర్ఎస్ అభ్యర్థులు ప్రచారంలో దూసుకెళ్లారు. పెద్దపల్లి, మంథని, రామగుండం అభ్యర్థులు దాసరి మనోహర్‌రెడ్డి, పుట్ట మధూకర్, కోరుకంటి చందర్‌తోపాటు జిల్లాపరిధిలోకి వచ్చే ధర్మపురి బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను అభ్యర్థులను ఆగస్టు 21న ప్రకటించగా, అప్పటి నుంచే వారు రంగంలోకి దిగారు. మిగతా పార్టీలు అభ్యర్థులను ప్రకటించక ముందే నియోజకవర్గాలను చుట్టి వచ్చారు. ఈనెల 3న ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చే నాటికే గడపగడపనూ తట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో అనుభవించిన కష్టాలు, స్వరాష్ట్రంలో సాధించిన విజయాలను కండ్ల ముందుంచారు. గడిచిన తొమ్మిదేండ్లలో చేసిన అభివృద్ధిని వివరిస్తూనే.. తాము గెలిస్తే చేయబోయే పనుల ప్రణాళిక, బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లి మద్దతు కూడగట్టారు.

**- పెద్దపల్లి, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ)**



- నెల రోజులుగా హోరెత్తిన ప్రచారం
- సీట్ల ఖరారు నుంచే రంగంలోకి గులాబీ అభ్యర్థులు
- మూడు నెలల నుంచి ప్రజలతో మమేకం
- చేసిన అభివృద్ధి.. చేయబోయే పనులను వివరిస్తూ ఓట్ల అభ్యర్థన
- అధినేత ప్రజా ఆశీర్వాద సభలతో ఫుల్ జోష్
- ప్రసంగాలతో ఆలోచన రేకెత్తించిన సీఎం కేసీఆర్
- కరెంట్, ధరణి, ఓటు హక్కు వినియోగం, సింగరేణికి జీవం పోయడంపై జోరుగా చర్చ ● ముఖ్యమంత్రి హామీలపై సంపూర్ణ విశ్వాసం ● మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సభలు, రోడ్‌షోలతో ఉత్సాహం ● సకల జనుల నుంచీ పెరిగిన మద్దతు
- ముగిసిన ప్రచారం.. ఆఖరి రోజూ హోరాహోరు
- వేలాది మందితో రోడ్‌షోలు.. ర్యాలీలు

## పెద్దపల్లి అభివృద్ధికి హామీ

అభివృద్ధిని చూసి దాసరి మనోహర్‌రెడ్డిని 70వేల ఓట్ల మెజార్టీతో గెలిపించాలని ఈ నెల7న ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పెద్దపల్లికి బస్సు డిపో, కొలనూరు, గర్రెపల్లి, పెద్దపల్లి రూరల్ మండలాలు, ఎలిగేడులో పోలీసు స్టేషన్‌ను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అక్టోబర్ ఒకటిన దశాబ్ది సభ, ఈ నెల 27న రోడ్ షోలో పాల్గొన్న మంత్రి కేటీఆర్, పెద్దపల్లి నియోజకవర్గానికి వరాల జల్లు కురిపించారు. దాసరి మనోహర్‌రెడ్డిని 50వేల నుంచి 60వేల భారీ మెజార్టీతో గెలిపిస్తే ఆయన ప్రతి డిమాండ్‌ను పరిష్కరిస్తామన్నారు. ₹25 నుంచి ₹50కోట్లను కేటాయించి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ నెల 19న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పెద్దపల్లిలో రోడ్ షో నిర్వహించారు.



పెద్దపల్లి రైల్వేస్టేషన్ రోడ్‌లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు ▼ | ▲ పెద్దపల్లి రైల్వేస్టేషన్ రోడ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దాసరి మనోహర్‌రెడ్డి

## వెయ్యికోట్లతో మంథని అభివృద్ధి

మంథని నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రోడ్డు షో, రామగిరిలో ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొనగా నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొన్నది. సీఎం కేసీఆర్ మంథని అభివృద్ధి జరిగిందంటే కేవలం పుట్ట మధూకర్ ఎమ్మెల్యే అయ్యాకేనని గుర్తు చేశారు. మరో మళ్లీ ఆయనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని రూ. వెయ్యి కోట్ల ప్రత్యేక నిధులతో అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. దీనికి తోడు ఒక బీసీ బిడ్డకు మంథనిలో అవకాశం ఇచ్చాం బీసీ ఉద్యోగులు, విద్యార్థులు, రిటైర్డ్ ఉద్యోగులు మీరు చైతన్యం చూపించాలని కోరారు. వెయ్యి కోట్లు మంజూరు చేసి మీ దరిద్రం పోగుడుతా.. నేను కూడ ఒక్కరోజు ఇక్కడికివస్తా.. అధికారులతో.. అన్ని మండలాలనాయకులతో సమావేశమై పుట్ట మధు ఆధ్వర్యంలో ఏమేమి పనులు చేయాలో అవన్నీ చేసుకుందాం అన్నారు. హైదరాబాద్‌లో ఉండేటోళ్లకు ఓటెస్తే ఏమి రాదు. మధును గెలిపించుకోవాలని పిలుపు నివ్వడంతో ప్రజల్లో ప్రధాన చర్చ జరుగుతున్నది. అలాగే ప్రజా ఆశీర్వాద సభ, రోడ్‌షోలో పాల్గొన్న ఎమ్మెల్సీ కవిత మంథని నియోజకవర్గంలో పుట్ట మధూకర్‌ను గెలిపిస్తే ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నియోజకవర్గాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తారని ప్రజలు బీఆర్ఎస్‌కే పట్టం కట్టాలని పిలుపునిచ్చారు.



మంథని రూరల్ : లక్కెపూర్‌లో ఓటు అభ్యర్థిస్తున్న మంథని బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధూకర్

పెద్దపల్లి (నమస్తేతెలంగాణ) నవంబర్ 28: బీఆర్ఎస్ అభ్యర్థుల తరపున అధినేత కేసీఆర్ ప్రచారాన్ని హోరెత్తించారు. ఈ నెల 2న ధర్మపురి, ఈ నెల 7న మంథని, పెద్దపల్లి, ఈ నెల 24న రామగుండం ప్రజా ఆశీర్వాద సభలకు హాజరై ప్రజలను చైతన్యం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో అనుభవించిన కష్టాలు, ఈ ప్రాంతానికి జరిగిన అన్యాయం, సింగరేణిని కాంగ్రెస్ ముంచిన తీరు.. స్వరాష్ట్రంలో సాధించిన విజయాలు, సింగరేణి సంస్థను ఆదుకున్న తీరును వివరించారు. ఇక్కడ చేసిన ఉద్యమాలను, కార్మికుల సమ్మెలను గుర్తు చేశారు. ఉద్యమ సమయంలోనే ఈ ప్రాంత సమస్యలన్నింటినీ గుర్తించి, అధికారంలోకి వచ్చిన తర్వాత పరిష్కరించిన తీరును కండ్ల ముందుంచారు. 24గంటల కరెంట్, ధరణి, రైతుబంధుపై కాంగ్రెస్ చేస్తున్న కుట్రలు, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువను తెలియజేశారు. అందరి భవిష్యత్తును నిర్ణయించేది ఈ ఓటేనని, విచక్షణతో ఓటు వేయాలని, అభ్యర్థులు.. వారి వెనక ఉన్న పార్టీలను చూడాలని, ఆగం కావొద్దని సూచించారు. గులాబీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపిస్తే.. మంథనిని వెయ్యి కోట్లతో అభివృద్ధి చేస్తానని, రామగుండాన్ని పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చేస్తానని, దాసరి అడిగినవన్నీ చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే బీఆర్ఎస్ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకతను వివరించి ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేశారు. అలాగే గత నెల ఒకటిన రామగుండం, మూడున పెద్దపల్లిలో మంత్రి కేటీఆర్ దశాబ్ది సభలకు హాజరై, జోష్ నింపారు. ఈ నెల 19న పుట్ట మధు తరపున కాటారం, రామగిరిలో సభ, పెద్దపల్లిలో దాసరి మనోహర్‌రెడ్డి తరపున ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రచారం చేశారు. సెంటిమెంట్లకు, కన్నీళ్లకు కరిగిపోయి ఓటు వేయవద్దని.. ఓటమితో చావే మార్గమని చెప్పే వారికి ఓటు వేస్తే మనకే చావు తప్పదనే విషయాన్ని ప్రజలు గ్రహించాలని సూచించారు. అయితే అధినేత కేసీఆర్, మంత్రి కేటీఆర్ చెప్పిన ప్రతి విషయంపైనా ప్రతి గ్రామంలోనూ ప్రజలు చర్చిస్తున్నారు. కాంగ్రెస్ ఓటేస్తే కరెంట్ ఆగమవుతుందని, ధరణి రద్దయి భూములకు భద్రత లేకుండా పోతుందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గత పాలనలో పడ్డ కష్టాలు ఇంకా కండ్ల ముందే కనిపిస్తున్నాయని, తాము ఇంకా మరిచిపోలేదని నాటి రోజులను గుర్తు చేస్తున్నారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి ముందుకు సాగుతుందని చెబుతున్నారు.



ముత్తారం : మండల కేంద్రంలో ర్యాలీలో భారీగా పాల్గొన్న ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు

## పారిశ్రామికంగా తీర్చిదిద్దుతానని కేసీఆర్ హామీ..

రామగుండంలో ఈ నెల 25న నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరయ్యారు. నియోజకవర్గంలోని సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్‌తో పాటుగా ఈ ప్రాంతంలోని జలాలు, రోడ్లు, రైల్ రవాణాతో రామగుండం పారిశ్రామిక ప్రాంతాన్ని ఇక్కడ ఉన్న వనరులకు అనుగుణంగా పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తానని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. కాంగ్రెస్ పాలనలో సింగరేణికి జరిగిన నష్టాన్ని, బీఆర్ఎస్ సర్కార్ వచ్చిన తర్వాత చేపట్టిన సంక్షేమాన్ని వివరించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటనలో రామగుండం నియోజకవర్గంలో కోరుకంటి చందర్‌ను మరో మారు గెలిపించి కానుకగా ఇవ్వండి.. నేను ఈ నియోజకవర్గాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. ఎన్నికల ప్రచారం పూర్తికాగా ప్రజల్లో మాత్రం కేసీఆర్, కేటీఆర్ ఇచ్చిన వాగ్దానాలపై చర్చ నడుస్తున్నది. దీనికి తోడు బీఆర్ఎస్ సర్కార్ వస్తేనే సింగరేణి ద్వారానే రాష్ట్రంలోని అన్ని రకాల మైనింగ్‌లను చేపడుతామని చెప్పడంతో నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు పరిస్థితులు పూర్తిగా అనుకూలంగా మారాయి.

భూపాలపల్లి జిల్లా కాటారంలో పుట్ట మధూకర్ ప్రచారంలో బీఆర్ఎస్ కార్యకర్తల భారీ బైక్ ర్యాలీ



## పారిశ్రామిక ప్రగతికి హామీ

రామగుండంలో ఈ నెల 25న నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరయ్యారు. నియోజకవర్గంలోని సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్‌తో పాటుగా ఈ ప్రాంతంలోని జలాలు, రోడ్లు, రైల్ రవాణాతో రామగుండం పారిశ్రామిక ప్రాంతాన్ని ఇక్కడ ఉన్న వనరులకు అనుగుణంగా పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తానని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. కాంగ్రెస్ పాలనలో సింగరేణికి జరిగిన నష్టాన్ని, బీఆర్ఎస్ సర్కార్ వచ్చిన తర్వాత చేపట్టిన సంక్షేమాన్ని వివరించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటనలో రామగుండం నియోజకవర్గంలో కోరుకంటి చందర్‌ను మరోసారి గెలిపించి కానుకగా ఇవ్వాలని, నేను ఈ నియోజకవర్గాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. ఎన్నికల ప్రచారం పూర్తికాగా ప్రజల్లో మాత్రం కేసీఆర్, కేటీఆర్ ఇచ్చిన వాగ్దానాలపై చర్చ నడుస్తున్నది. దీనికి తోడు బీఆర్ఎస్ సర్కార్ వస్తేనే సింగరేణి ద్వారానే రాష్ట్రంలోని అన్ని రకాల మైనింగ్‌లను చేపడుతామని చెప్పడంతో నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు పరిస్థితులు పూర్తిగా అనుకూలంగా మారాయి.

